క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: రమణయ్యపేట పంచాయతీ పరిధి దండువుంత, ఈశ్వర్‌నగర్‌లకు చెందిన పలువురు టీడీపీ, జనసేన నాయకులు వైఎస్సార్ సీపీలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో శనివారం రాత్రి చేరారు. రమణయ్యపేట వైద్య నగర్ క్యాంపు కార్యాలయంలో తుర్లపూడి నాని, జంగా గగారిన్‌ల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కన్నబాబు మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేకమంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, రమణయ్యపేట వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, ధర్మరాజు, వైఎస్సార్ రాజు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



రమణయ్యపేటలో నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న కోరమాండల్ మహిళా క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట ఏపీ ఐఐసీ కాలనీలో కోరమాండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులు, పేదలకు శుక్రవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి మల్లేశ్వరి మాట్లాడుతూ ప్రతి నెలా పేదలకు, వ్యాధిగ్రస్తులకు నిత్యావసరాలు అందిస్తున్నామన్నారు. ఇందుకు తమ క్లబ్ అధ్యక్షురాలు దుర్గావతి, సభ్యులు సహకరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో శ్రీదేవి, మోహినికుమారి, విజయలక్ష్మి, చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సేవలు మరింత విస్తృతం

బోట్‌క్లబ్: క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు నరహరిశెట్టి రవికృష్ణ అన్నారు. స్థానిక రోటరీ హాల్‌లో శనివారం క్లబ్ తొలి సమావేశం నిర్వహించారు. సీఎస్ఆర్ నిధులు సేకరించి క్లబ్ సీనియర్ సభ్యుల సలహాలు, సూచనలతో క్లబ్‌ను ముందుకు నడుపుతానన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రోటరీ మాజీ గవర్నర్ ఎం వీరభద్రారెడ్డి (బాబీ) మాట్లాడుతూ రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. క్లబ్ కార్యదర్శి జోగా చంద్రరావు, కోశాధికారి ఎం.పవన్, సభ్యులు జీకే శ్రీనివాస్, రంగారావు, వెత్సా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

కాకినాడ రూరల్: గంజాయి కేసులో ఎనిమిది మందిని ఇంద్రపాలెం పోలీసులు అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరు పరిచారు. ముందస్తు సమాచారం మేరకు రూరల్ సీఐ కె.శ్రీనివాస్, ఇంద్రపాలెం ఎస్సై నాగరాజు, సిబ్బంది కొవ్వాడ రైల్వే ట్రాక్ వద్ద శుక్రవారం దాడి చేయగా 8 మంది పట్టుబడ్డారు. వారి నుంచి 24.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో పోతు విద్యాసాగర్, దూలపల్లి సూరిబాబు, చల్లా నాగశివ మణికంఠ, గాలేటి దొరబాబు, మామిడాల సాయిరామ్, వెలంకుల మహేష్, కొప్పిశెట్టి ఉదయ్ ఈశ్వర్, మద్దాల ఉదయ్‌కుమార్ ఉన్నారు. ఉమ్మిడి ఇమ్మానుయేల్ పరారీలో ఉన్నట్టు ఎస్సై నాగరాజు తెలిపారు.

ఘనంగా జయతీర్థ ఆరాధన



జయతీర్థుల బృందావనానికి పూజలు చేస్తున్న మధ్వపురోహితుడు మధ్వేష్

బోట్‌క్లబ్: కాకినాడ మధ్వసభ కమిటీ ఆధ్వర్యంలో ఉత్తరాది మఠాధిపతి జయతీర్థులు ఆరాధన మహోత్సవాలు శనివారం నిర్వహించారు. మధ్వపురోహితుడు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో చొల్లంగి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని జయతీర్థుల మృత్తికా బృందావనానికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామారావుపేటలోని మధ్వసభలో బ్రాహ్మణులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు రాచూరి రాఘవేంద్రస్వామి, కార్యదర్శి కోపల్లి శేషగిరిరావు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కాకినాడ సిటీ: ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ కాకినాడ ధర్నా చౌక్ వద్ద నిరసన తెలిపారు. నాయకులు రవికుమార్, ఏజీ కృష్ణ, చింతా నారాయణమూర్తి, బాషా, అలీం, బండారు నారాయణ తదితరులు పాల్గొన్నారు.



జేఎన్‌టీయూకేలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ ప్రసాదరాజు తదితరులు



వైఎస్సార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తదితరులు



కరపలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు చింతా, జెడ్పీటీసీ సుబ్బారావు, ఎంపీపీ శ్రీలక్ష్మి



వేములవాడలో మహానేతకు వైఎస్సార్ సీపీ శ్రేణుల నివాళి

జన హృదయ నేతకు జేజేలు

- అట్టహాసంగా వైఎస్సార్ జయంతి వేడుకలు
- సేవా కార్యక్రమాలతో అభిమానం చాటిన పార్టీ శ్రేణులు

కాకినాడ: జన హృదయ నేత వైఎస్సార్‌కు జేజేలు పలికారు.. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారంటూ కొనియాడారు.. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను నగర, రూరల్ నియోజకవర్గాల్లో అట్టహాసంగా నిర్వహించారు. సేవా కార్యక్రమాలు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రజల హృదయాల్లో మహానేత వైఎస్సార్ ఎప్పటికీ చిరస్థాయిగా ఉంటారని ఎంపీ వంగా గీత, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. వైఎస్సార్ జయంతి కార్యక్రమాలను కాకినాడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కోకిల సెంటర్, బాలాజీచెరువు వద్ద ఉన్న వైఎస్సార్ కాంస్య విగ్రహాలకు ఎంపీ, ఎమ్మెల్యేలు పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్ వంటి పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన వారసుడిగా సీఎం జగన్ పేదల కష్టాలను తీర్చేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రిపద్మశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, చోడిపల్లి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

పేదల గుండెల్లో వైఎస్సార్

కాకినాడ రూరల్: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు పేదల గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా ఉంటాయని పార్టీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడ 1వ డివిజన్ రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ జయంతి వేడుకలను నిర్వహించారు. బర్త్ డే కేక్‌ను పార్టీ శ్రేణుల మధ్య కట్ చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ వైఎస్సార్ రాష్ట్ర రాజకీయాల్లో నూతన శకానికి నాంది పలికారన్నారు. రైతు లేనిదే రాష్ట్రం లేదని రైతు సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. నాయకత్వమంటే ఎలా ఉండాలో ఒక నిఘంటువులా మారి, దేశంలో తెలుగువారికి గౌరవం తెచ్చిన మహానాయకుడన్నారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చక్కని పాలన అందిస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, నియోజకవర్గ పరిశీలకుడు దున్నా జనార్దనరావు, జెడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, గోపుశెట్టి బాబ్జీ, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వాకలపూడిలో జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో ఎంపీ వంగా గీత పాల్గొన్నారు. ఎమ్మెల్యే కన్నబాబుతో కలసి కేక్ కట్ చేశారు. ఎంపీ గీత మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి సీఎంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. తిమ్మాపురంలో వైఎస్సార్ విగ్రహానికి సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ బందిలి వీరేష నివాళులర్పించారు. కొవ్వాడలో ఎంపీపీ గోపుశెట్టి పద్మజ, వలసపాకలలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సూర్యారావుపేటలో సూరాడ రాజు, కోమలి సత్యనారాయణ తదితరులు వైఎస్సార్‌కు నివాళులర్పించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వృద్ధుల ఆశ్రమంలో జరిగిన అన్నదానంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ కురసాల సత్యనారాయణ పాల్గొన్నారు.



వైఎస్సార్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పక్కన ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా



వాకలపూడిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ గీత

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పేదలకు సాంకేతిక విద్యాఫలాలు అందించాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కాకినాడలో జేఎన్‌టీయూ వర్సిటీ ఏర్పాటు చేశారని వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. జేఎన్‌టీయూకేలో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ సాంకేతిక విద్యారంగంలో విప్లవ మార్పులు తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. రిజిస్ట్రార్ ఎల్.సుమలత, డీఏపీ మురళీకృష్ణ, డైరెక్టర్ రవీంద్ర, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

కరప మండలంలో..

కరప: స్థానిక పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిలు పార్టీ శ్రేణులతో కలసి పూలమాలలు వేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, సర్పంచులు సాదే ఆశాజ్యోతి, పలివెల నాగేశ్వరరావు, నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్‌కుమార్, ఉప సర్పంచ్ బొగిరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వేములవాడలో నాయకులు కమిడి శంకర్, పాలిక వీర్రాజు, యండమూరులో సర్పంచ్ మార్నెళ్ల శివ, గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, నడకుదురులో సర్పంచ్ దేగల లలితకుమారి, పైలా గోవిందు తదితరులు వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఉప్పలంకలో గ్రామకమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.



సూర్యారావుపేటలో మత్స్యకారుల ఆధ్వర్యంలో..

కాకినాడ సిటీ: తూరంగి పగడాలపేట, పంచాయతీ కార్యాలయం, వెలంపేటల్లో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. నాయకులు బలగం ప్రసన్నకుమార్, అడ్డూరి అవ్యక్త, గరికిన అప్పన్న తదితరులు పాల్గొన్నారు. కొవ్వూరులో సర్పంచ్ పిల్లి చక్రరావు, ఉప సర్పంచ్ పబ్బినీడి రమేష్ తదితరులు వైఎస్సార్‌కు నివాళి అర్పించారు.

అభివృద్ధి ప్రదాత వైఎస్సార్

కాకినాడ సిటీ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన ప్రజలకు స్వర్ణయుగమని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి వేడుకలను నిర్వహించారు. జిల్లాలోని రైతులు మూడు పంటలు పండించే విధంగా చర్యలు చేపట్టిన మహోన్నత వ్యక్తి వైఎస్సార్ అని విప్పర్తి అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ అందించిన ఘనత వైఎస్సార్‌దే అని కొనియాడారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని రాఘవ 24 గంటల ఎమర్జెన్సీ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ నెక్కంటి రాఘవ చౌదరి ఆధ్వర్యంలో జెడ్పీ ఉద్యోగులు, ఇంజినీరింగ్ డివిజన్, సబ్‌డివిజన్, జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాల సిబ్బందికి గుండెకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేశారు. జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, తాళ్లరేవు జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్, మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ ఎల్.ప్రసాద్, జిల్లా అధికారులు కలసి రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులకు పంచారు.

హ్యాపీ.. హ్యాపీగా..



రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి



బులుసు సాంబమూర్తి పాఠశాలలో సేవలు

- ఎమ్మెల్యే ద్వారంపూడి పుట్టినరోజు వేడుకలు
- అట్టహాసంగా సేవా కార్యక్రమాలు

కాకినాడ: స్థానికంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం అట్టహాసంగా నిర్వహించారు. రక్తదాన శిబిరాలు, వస్త్రదానాలు, అన్నసమారాధనతో పాటు అనేక సేవా కార్యక్రమాలను పార్టీ శ్రేణులు చేపట్టి తమ అభిమానం చాటుకున్నారు. వైఎస్సార్ జయంతి, ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక డి.కన్వెన్షన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సహకరించారు. ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించగా సుమారు 100 మంది రక్తదానం చేశారు. రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి, కార్యదర్శి నల్లమిల్లి మాచారెడ్డి, కన్వీనర్లు జి.దుర్గాప్రసాద్‌రెడ్డి, సత్తి రాంబాబురెడ్డి, కర్రి సద్గురునాథరెడ్డి, నల్లమిల్లి గంగిరెడ్డి తదితరులు పర్యవేక్షించారు. బులుసు సాంబమూర్తి పాఠశాలలో పార్టీ శ్రేణులు అన్న, వస్త్రదానాలు చేశారు. కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు) పాల్గొన్నారు.

వలంటీర్ కుటుంబానికి చేయూత

ఇటీవల అనారోగ్యంతో ఓ వలంటీర్ మృతిచెందగా ఆ కుటుంబానికి ఎమ్మెల్యే ద్వారంపూడి ఆర్థిక చేయూత అందించారు. 27వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లిన సందర్భంలో ఆ పేద కుటుంబం గురించి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ఆమె పిల్లల చదువు కోసం అప్పటికప్పుడు రూ.25 వేలు ఇచ్చిన ఎమ్మెల్యే శనివారం సదరు వలంటీర్‌కు చెందిన ఇద్దరు పిల్లలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆమె భర్తకు నగరపాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాన్ని ఇచ్చేందుకు కలెక్టర్, కమిషనర్ల దృష్టికి తీసుకువెళ్లి ఒప్పించారు.



ఎమ్మెల్యే ద్వారంపూడి దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీ ఎన్జీవో నేతలు

పాస్టర్ల ప్రార్థనలు

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బీహెచ్‌వీ మూర్తిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యేను ఆయన నివాసంలో పాస్టర్లు కలిశారు. ఎమ్మెల్యేకు మంచి జరగాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన ప్రతి విజయంలోనూ క్రైస్తవులు అండగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు జ్యోతికుమార్, డి.విలియమ్స్, వైఎస్సార్ సీపీ జిల్లా క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడు దడాల జాషువాగిరి, న్యాయవాది డేవిడ్ శామ్యూల్, ఎం.అబ్రహం, కృపావరం, విక్లిఫ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవోల శుభాకాంక్షలు

కాకినాడ క్రైం: ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘ నేతలు ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సరెళ్ల చంద్రరావు, నగర అధ్యక్షుడు షేక్ అజీజ్ తదితరులు ఉన్నారు.

రైతు పక్షపాతి సీఎం జగన్

కాకినాడ రూరల్: రైతు పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నారని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. సర్పవరం జంక్షన్‌లో ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి ఎంపీ, ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం కింద రూ.62.85 లక్షల ఉచిత బీమా పరిహారం సొమ్మును సుమారు 362 మంది రైతులకు పంపిణీ చేశారు. వెటర్నరీ జేడీ సూర్యప్రకాశరావు, డీడీ ఆర్.వెంకటేశ్వరరావు, ఏడీ సురేష్‌బాబు, వెటర్నరీ వైద్యులు సురేష్, రవికిరణ్‌బాబు, అనిల్ విల్సన్, రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ పశు నష్ట పరిహార చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

వైఎస్సార్‌టీఎఫ్‌లో ఇద్దరికి చోటు

బాలాజీచెరువు (కాకినాడసిటీ): ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీ వైఎస్సార్‌టీఎఫ్) రాష్ట్ర కార్యవర్గంలో కాకినాడ జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు లభించింది. ఈ విషయాన్ని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వరరావు, వీరవల్లి గోపికృష్ణ శనివారం తెలిపారు. తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో అనుబంధ సంఘాల అధ్యక్షుడు వి.విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కమిటీ ఎన్నిక జరిగిందన్నారు. కాకినాడ జిల్లాకు చెందిన కసా వెంకటరమణమూర్తి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, బోడ పాల్‌క్రిష్టోఫర్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారని అన్నారు. ఈ నియామకం పట్ల వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నేతలు కె.జయరాజు, కె.సత్యనారాయణ, బెన్‌జాన్సన్, బి.శ్రీకాంత్, పి.శరత్‌చంద్ర హర్షం వ్యక్తం చేశారు.



కసా వెంకటరమణమూర్తి



బోడ పాల్‌క్రిష్టోఫర్

లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కరించండి

కాకినాడ లీగల్: లోక్ అదాలత్ ద్వారా అధిక కేసులు పరిష్కరించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. శనివారం కాకినాడ కోర్టులో బార్ అసోసియేషన్‌ను ఆమె సందర్శించారు. కాకినాడకు కొత్తగా ఎస్సీ, ఎస్టీ కోర్టు, కమర్షియల్ కోర్టులు మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాదులు విన్నవించగా పరిశీలిస్తామని న్యాయమూర్తి చెప్పారు. కోర్టు ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న కాకినాడ మూడో అదనపు జిల్లా కోర్టు భవన సముదాయం, సబ్ కోర్టు, మున్సిఫ్ కోర్టులను జిల్లా న్యాయమూర్తులు పి.కమలాదేవి, హరినారాయణ, నిఖిత, పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు, స్టేట్ బార్ మెంబర్ నరహరిశెట్టి రవికృష్ణ తదితరులతో కలసి పరిశీలించారు. ఈ కోర్టు భవనాలను వీలైంత త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముత్తింటి విశ్వేశ్వరరావు, చెక్కా శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వీరభద్రరావు, జాయింట్ సెక్రటరీ శంకర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటికలు

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళా మందిర్‌లో అల్లూరి సీతారామరాజు నాటక పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం ముందుగా ఏకపాత్రాభినయం పోటీలు జరిగాయి. శాస్త్రి కళాపీఠం వ్యవస్థాపకుడు సీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రికి ఆంధ్రశ్రీ అవార్డు, ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ కార్యదర్శి ఓఏన్ ప్రసాద్‌కు ఆత్మీయ రంగస్థల పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. సిరిమువ్వ కల్చరల్ అసోసియేషన్ (హైదరాబాద్) సమర్పణలో శ్రీమంజునాథ్ దర్శకత్వంలో ప్రదర్శించిన ‹థింక్› నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. మంచి ఆలోచనతో సమాజాన్ని ఏవిధంగా పురోగతి వైపు నడిపించవచ్చో వివరించారు. అనంతరం చైతన్యభారతి సంస్థ (కరీంనగర్) సమర్పణలో మంచాల రమేష్ దర్శకత్వంలో ప్రదర్శించిన 'ఖరీదైన జైళ్లు' నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఖైదీలలో పరివర్తన తీసుకు రావాల్సిన జైళ్లు ఏవిధంగా పక్షపాత వైఖరితో పనిచేస్తున్నాయో కళ్లకు కట్టినట్లు వివరించారు. అనంతరం శ్రీకృష్ణా తెలుగు థియేటర్స్ (గుడివాడ) సమర్పణలో శిరం శ్రీనివాసరావు దర్శకత్వంలో ప్రదర్శించిన పారిజాతం నాటిక అలరించింది. పరిషత్ గౌరవ అధ్యక్షులు కర్రి ఛామిరెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు, పంపన మురళి, ఎస్.సత్యనారాయణ, ఎస్.జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.



థింక్ నాటికలో ఓ సన్నివేశం

పునర్జన్మనిస్తే నిందలేస్తారా..!

- కోవిడ్ సమయంలో ఎమ్మెల్యే సేవలు ఎనలేనివి
- 'ఈనాడు' రాతలపై పలువురి మండిపాటు

కాకినాడ: కోవిడ్ మహమ్మారి ప్రజలపై పంజా విసిరిన సమయంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తీసుకున్న చొరవ తమకు పునర్జన్మనిచ్చిందని అప్పట్లో వైద్య సేవలు పొందిన వారి కుటుంబీకులు తెలిపారు. కోవిడ్ సమయంలో ఆస్పత్రుల నుంచి కమీషన్లు తీసుకున్నారంటూ 'ఈనాడు' దినపత్రికలో ఎమ్మెల్యే ద్వారంపూడిపై వచ్చిన కథనాలపై బాధితులు స్పందించి తమ మనోభావాలను వివరించారు. ఈ మేరకు శనివారం స్థానిక డి.కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కమ్యూనిస్టు నేత, కార్మిక నాయకుడు కిర్ల కృష్ణారావు మాట్లాడుతూ తన కుటుంబం కోవిడ్ బారిన పడిన సమయంలో ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రత్యేక చొరవ తీసుకుని పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యాన్ని అందించారన్నారు. తాము ప్రస్తుతం ఆరోగ్యంగా జీవించగలుగుతున్నామంటే ద్వారంపూడే కారణమని, అది జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. సీనియర్ జర్నలిస్టు అల్లుమల్లు ఏలియా మాట్లాడుతూ తన మిత్రుడు, మరో సీనియర్ జర్నలిస్టు కోవిడ్ బారిన పడిన సమయంలో అర్ధరాత్రి 12 గంటలకు ద్వారంపూడిని సంప్రదిస్తే ఆరోగ్యశ్రీలో మెరుగైన కార్పొరేట్ వైద్యాన్ని అందించేలా చేసి పునర్జన్మ ఇచ్చారన్నారు. అటువంటి ఎమ్మెల్యేపై ఆరోపణలు చూసి ఎంతో బాధ కలిగిందన్నారు. త్రిపురసుందరి ఆలయ ప్రధాన పూజారిగా ఉండే రాజా, మరో ముగ్గురు ఆయన కుటుంబీలకు కూడా ఎమ్మెల్యే ద్వారంపూడి ఎంతో సేవ చేశారని రాజా అల్లుడు విజయ్‌కుమార్ తెలిపారు. పైసా ఖర్చు లేకుండా అప్పుడు వైద్యం పొందామన్నారు.

నిజాలు రాయండి: ఎమ్మెల్యే ద్వారంపూడి

కోవిడ్ సమయంలో ప్రజలకు అందించిన సేవలను విస్మరించి తనపై ఆరోపణలు వేయడం ఈనాడు పత్రికకు తగదని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక డి.కన్వెన్షన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వాస్తవాలను 'చూసి రాయండి.. నిజాలు రాయండి' అని ఈనాడుకు హితవు పలికారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వియ్యంకుడు సంగాని వెంకటేశ్వరరావుతో పాటు ఎంతో మంది ఆ పార్టీకి చెందిన వ్యక్తులకు కూడా కోవిడ్ సమయంలో సేవలు అందించామన్నారు. ప్రధానంగా తన కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు బాధితుల ఆరోగ్యాన్ని వాకబు చేయడం, మెరుగైన సేవల కోసం వైద్యులతో చర్చించడం, అవసరమైన మందులు, భోజన సదుపాయాలనూ సొంత ఖర్చుతో ఏర్పాటు చేశామన్నారు. ఆక్సిజన్ సిలిండర్లు, వెంటిలేటర్లు ఏర్పాటు, రెమిడిసివర్ ఇంజెక్షన్లను హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి రప్పించడం చేశామన్నారు. ఇవన్నీ బాధితులకు తెలుసన్నారు. కొన్ని ఆస్పత్రుల దోపిడీని అదుపు చేసే క్రమంలో సీఎం దృష్టికి తీసుకువెళ్లి అప్పటి కలెక్టర్ మురళీధర్‌రెడ్డి ద్వారా కొన్ని ఆస్పత్రులకు రూ.6 కోట్ల వరకూ ఫెనాల్టీలు కూడా విధించామన్నారు. విమర్శలు మానుకుని వాస్తవంలోకి రావాలని 'ఈనాడు' అధిపతి రామోజీరావుకు ఆయన హితవు పలికారు.



కోవిడ్ నుంచి కోలుకున్న బాధితులతో ఎమ్మెల్యే